ధాన్యం కొనుగోళ్లలో దళారుల హవా!

- రైతు సేవా కేంద్రాల ముసుగులో దందా
- రైతు వద్ద తక్కువ ధరకు కొని మిల్లర్లకు ఎక్కువ ధరకు విక్రయం
- అన్నదాతకు లభించని మద్దతు ధర
- రోడ్లపైనే ధాన్యం రాశులు
- ముమ్మరంగా వరి కోతలు

దేవరపల్లి: ధాన్యం కొనుగోళ్లలో దళారుల హవా కొనసాగుతోంది. రైతు సేవా కేంద్రాల (ఆర్ఎస్కే) ముసుగులో దళారులు రైతుల నుంచి తక్కువ ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేసి వాటిని మిల్లర్లకు ఎక్కువ ధరకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన అన్నదాత నష్టమే మిగులుతోంది. రైతుల నుంచి 75 కిలోల బస్తా ధాన్యం రూ.1250 నుంచి 1300 దళారులు కొనుగోలు చేసి మిల్లర్లకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.1730 అమ్ముకుని లక్షల రూపాయలు సంపాదిస్తున్నారని రైతులు వాపోతున్నారు. తేమ శాతం నిబంధనలను అడ్డు పెట్టుకుని దళారులు దోపిడీ చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. 17 శాతం తేమ ఉంటే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.1730 రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలించకపోవడం, అకాల వర్షాలు కురుస్తుండడంతో ధాన్యం తడవడంతో తేమ శాతం 18 నుంచి 20 శాతం ఉంటుందని రైతులు తేలిపారు. తేమ శాతం ఎక్కువ ఉందని దళారులు బస్తా రూ. 1250 కొనుగోలు చేస్తున్నారని రైతులు తెలిపారు. ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలకు రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం తడిసి మద్దయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కష్టాలు పడలేక అయిన కాడికి అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నామని రైతులు వాపోతున్నారు.

52800 ఎకరాల్లో పంట సాగు

రబీ సీజన్లో కొవ్వూరు డివిజన్ పరిధి నిడదవోలు, గోపాలపురం, కొవ్వూరు నియోజకవర్గాల్లోని తొమ్మిది మండలాల్లో సుమారు 52,800 ఎకరాల్లో వరి పంట వేశారు. పంటను కొనుగోలు చేయానికి రైతు సేవా కేంద్రాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. డివిజన్ పరిధిలో 66 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఆలస్యంగా ప్రారంభించడంతో ముందుగా కోసిన పంటను తక్కువ ధరకు దళారులకు అమ్ముకోవలసి వచ్చిందని రైతులు అంటున్నారు. ఏప్రిల్ ఒకటో తేదీన కొనుగోలు కేంద్రాలు ప్రారంభించుంటే రైతులకు ఉపయోగకరంగా ఉంటాయని రైతులు అభిప్రాయపడుతున్నారు.

ముమ్మరంగా వరి కోతలు

మెట్ట ప్రాంతంలోని కొవ్వూరు డివిజన్లో వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. కోసిన ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి కళ్లాలు లేకపోవడంతో హైవేకు ఇరువైపుల గల సర్వీస్ రోడ్లపై ధాన్యాన్ని ఆరబెట్టి రైతులు అమ్ముకుంటున్నారు. కంటి మీద కునుకు లేకుండా రైతులు ధాన్యం రాసుల వద్ద పడిగాపులు పడి ఉంటున్నారు. యంత్రాలతో వరి చేలను కోసి ఆరబెట్టి ఆర్ఎస్కే కేంద్రాలు, దళారులకు అమ్ముకొంటున్నారు.

ఆశాజనకంగా దిగుబడి

రబీలో ధాన్యం దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. ఎకరాకు 50 నుంచి 60 బస్తాల దిగుబడులు వస్తున్నట్టు రైతులు తెలిపారు. పెట్టుబడి ఎకరాకు రూ.30 వేలు, కౌలు రూ.20 అవుతుందన్నారు. కౌలు రైతుకు ఎకరాకు రూ.10 వేలు మిగులుతుందని రైతులు వివరించారు. వరి వ్యవసాయం గిట్టుబాటు కావడంలేదని కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



దుద్దుకూరులో రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం



ధాన్య బస్తాలను మిల్లుకు తరలిస్తున్న రైతులు

నిబంధనలు సడలించాలి



ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం నిబంధనలను సడలించాలి. 17 శాతం తేమ ఉంటే మద్దతు ధర రూ.1730 చెల్లించవలసి ఉంది. వాతావరణం అనుకూలించక అకాల వర్షాలకు ధాన్యం తేమ శాతం 18 నుంచి 19 శాతం ఉంటోంది. దీంతో రైతు సేవా కేంద్రాలు రూ.1230 చెల్లిస్తున్నారు. దీని వల్ల రైతులు నష్టపోతున్నాం. 75 కిలోల బస్తాకు రూ.200 నుంచి 250 నష్టపోతున్నాం. తేమ శాతం నిబంధనలను సడలించి మద్దతు ధరకు కొనుగోలు చేసి ఆదుకోవాలి. 4 ఎకరాల్లో పంట వేశాను. ఎకరాకు 60 నుంచి 65 బస్తాల దిగుబడి వస్తోంది.

– పుట్టా సత్యనారాయణ, రైతు, యర్నగూడెం

గిట్టుబాటు కావడం లేదు



ధాన్యం ధర గిట్టుబాటు కావడంలేదు. ఎకరాకు పెట్టుబడి సుమారు రూ. 30 వేల అవుతుంది. కౌలు రూ. 12 బస్తాలు ఇవ్వాలి. దిగుబడి ఎకరాకు 50 బస్తాలు వచ్చింది. అకాల వర్షాలకు ఆరబెట్టిన ధాన్యం తడిచింది. ఒక్క రోజు ఆగితే ధాన్యం మిల్లుకు చేరేది. ఇంతలోనే రాత్రి సమయంలో కురిసిన అకాల వర్షానికి బరకాల క్రింద నుంచి నీరు పారడంతో ధాన్యం తడిచింది. 4 ఎకరాలు కౌలుకు తీసుకుని పంట వేశాను.

– పోలుమాటి గంగాధర్, కౌలు రైతు, దుద్దుకూరు

జగన్ పాలన రైతుకు బంగారం



వైఎస్సార్ ప్రభుత్వంలో జగన్‌బాబు పాలన రైతులకు బంగారంగా ఉంది. వర్షాలకు తడిచి పూచిపోయిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరకు కొనుగోలు చేశారు. దళారులు కనుచూపు మేర కనిపించలేదు. కూటమి ప్రభుత్వంలో రైతుకు ఎటువంటి లాభం లేదు. వ్యవసాయం గిట్టుబాటు కావడంలేదు, చాకిరి ఎక్కువ, ఆదాయం తక్కువగా ఉంది. రెక్కల కష్టమే మిగులుతోంది. దళారులు మాయ చేసి కారు చౌకగా కొట్టేస్తున్నారు.

– చిగురుపల్లి పకీర్, రైతు, దుద్దుకూరు

క్లుప్తంగా

డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ



చాగల్లులో అవగాహన కల్పిస్తున్న అధికారులు

చాగల్లు: డిజాస్టర్ మేనేజ్మెంట్పై మూడు రోజుల శిక్షణా కార్యక్రమంలో భాగంగా రెండో రోజు బుధవారం శిక్షణా చాగల్లు రైతు భరోసా కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన తహసీల్దార్ ఎం.మెరికమ్మ, ఎంపీడీవో ఆర్.శ్రీదేవి మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ముందు, తరువాత గ్రామాల్లో ఏవిధమైన చర్యలు తీసుకోవాలో వివరించారు. వైపరీత్యాలు సంభవించినప్పుడు వాటి తీవ్రతను తగ్గించడానికి ఏటువంటి చర్యలు తీసుకోవాలో తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

చాగల్లు: నెలటూరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయంకి సంబంధించి ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై రైతులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన సెర్ప్ డీపీఎం తాతారావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి చూపాలని అన్నారు. ప్రతి ఇంటిలో కిచెన్ గార్డెన్ వేసుకోవాలని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన ఆహారం తినాలని తెలిపారు. ఇన్‌చార్జి ఏపీఎం సాయి లక్ష్మీ, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పెరవలి: కానూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు డీఈ ఎస్.నారాయణ అప్పారావు తెలిపారు. కానూరు పరిధిలోని నడుపల్లి, నడుపల్లి కోట, కానూరు అగ్రహారం, ఉసులుమర్రు, తీపర్రు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల స్వీకరణ

నిడదవోలు రూరల్: మండలంలోని వివిధ బ్యాంకుల పరిధిలో ఉన్న అర్హులైన అభ్యర్థుల నుంచి ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఎంపీడీఓ డి.లక్ష్మీ నారాయణ బుధవారం తెలిపారు. దరఖాస్తులను మే నెల 10వ తేదీలోపు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెంది కుల ధ్రువీకరణ పత్రం ఉండాలన్నారు. 21 నుంచి 50 ఏళ్ల వయస్సు లున్న బీపీఎల్ కేటగిరికి చెందిన వారు మాత్రమే అర్హులని ఆయన పేర్కొన్నారు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నిడదవోలు : కొవ్వూరు మండలం విజ్జేశ్వరం-మద్దూరులంక దగ్గర గోదావరిలో ఈతకు వెళ్లి మృతి చెందిన పట్టణంలోని చర్చిపేటకు చెందిన విద్యార్థి ప్రవీణ్ కుటుంబ సభ్యులకు రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి బుధవారం పరామర్శించారు. ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని ఆమే హామీ ఇచ్చారు. మృతుడు కుటుంబ సభ్యులకు ఎంపీ ఆర్థిక సహకారం అందించారు. ప్రవీణ్ కుటుంబ సభ్యులకు బీజేపీ సీనియర్ నాయకుడు, లయన్స్ రంగా వెంకటేశ్వరరావు తన సొంత నిధులు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బండి సత్యనారాయణ, నీలం రామారావు తదితరులు పాల్గొన్నారు.

1200 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం

దేవరపల్లి: 12 వందల మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని గోపాలపురం నియోజకవర్గం ఎన్నికల అధికారి పి.భాగ్యవతి బీఎల్ఓలకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం మండలంలోని బూత్ స్థాయి అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఈఆర్వో భాగ్యవతి మాట్లాడుతూ 12 మంది ఓటర్ల కంటే ఎక్కువ మంది ఓటర్లు గల పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఎక్కువ మంది ఉన్న పోలింగ్ కేంద్రంలోని ఓటర్లను పక్క పోలింగ్ కేంద్రంలో నమోదు చేయాలన్నారు. ప్రతి 12 వందల మంది ఓటర్లకు ఒక పోలింగ్ బూత్ ఉండాలని ఆమె తెలిపారు. 18 ఏళ్లు గల ప్రతి యువతకు ఓటు నమోదు చేయాలని ఆమె సూచించారు. ఓటర్ల జాబితాను పరిశీలించి మరణించిన ఓటర్లు, డబ్లింగ్, గ్రామంలో లేని ఓటర్లను తొలగించాలని ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.శ్రీనివాస్, అధికారులు, మండలంలోని 78 మంది అధికారులు పాల్గొన్నారు.

దీపాలమ్మా.. దీవించమ్మా

నల్లజర్ల: గంటావారిగూడెంలోని యలమర్తి వారి ఇలవేల్పు దీపాలమ్మ అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠాపన బుధవారం వైభవంగా జరిగింది. పోలసానిపల్లికి చెందిన కాశీభట్ల నాగ వెంకట పార్వతీశ్వర శర్మ ఆధ్వర్యంలో పూజాధికాలు నిర్వహించారు. 1993లో మూడు ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన ఆలయం శిథిలావస్థకు చేరడంతో దాదాపు రూ.5 లక్షలతో పునర్నిర్మించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయం ముందు రంగవల్లులు తీర్చిదిద్దారు. అర్చకులు ఉత్సవ సంకల్పం పటిస్తూ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కులస్తులలో ఇళ్లలో జరిగే వివాహ వేడుకకు ముందు పురుషుడైతే స్త్రీ వేషం, స్త్రీ అయితే పురుష వేషంతో ఆలయానికి వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పిస్తారని యలమర్తి నవీన్, రవికిశోర్, సత్యనారాయణ, శ్రీనివాసరావు, రామకృష్ణ, రత్నకిశోర్ తెలిపారు.

పాఠశాలకు ప్రేమతో..

రూ.2.50 లక్షలతో ఆర్వో ప్లాంట్ బహూకరణ

నల్లజర్ల: ప్రభుత్వ పాఠశాలలకు ఎన్ని నిధులు ఇచ్చినా ఇంకా సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో కొంతమంది పూర్వవిద్యార్థులు తాము చదివిన పాఠశాలల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. మండలంలోని పోతవరం జెడ్పీ హైస్కూలుకు 1981–82 టెన్త్ విద్యార్థులు రూ.2.50 లక్షల విలువైన ఆర్వో ప్లాంట్‌ను బహూకరించారు. దీనిని బుధవారం హెచ్ఎం గోపిగోవర్ధన్ చేతుల మీదుగా ప్రారంభించారు. పూర్వవిద్యార్థులు బలుసు పురుషోత్తం, అబ్బూరి ప్రసాదరావు, అట్లూరి సత్యనారాయణ, కంతేటి రమణ, గద్దే జనార్దన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. పూర్వవిద్యార్థుల సహకారంతో కొన్ని వసతులు సమకూరడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈపాఠశాలలో 590 మంది విద్యార్థులు చక్కని వాతావరణంలో చదువుకుంటున్నారు. తరచూ పూర్వవిద్యార్థులు సమావేశమవుతూ పాఠశాలలో సమస్యలు తెలుసుకుంటూ పరిష్కరించడానికి కృషి చేస్తున్నారు.



పూర్వవిద్యార్థులు బహూకరించిన ఆర్వోప్లాంట్‌ను ప్రారంభిస్తున్న హెచ్ఎం తదితరులు

ప్రకృతి వ్యవసాయం మిన్న

నల్లజర్ల: ప్రతి గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రకృతి వ్యవసాయ విభాగం మాస్టర్ ట్రైనర్ తమ్మిశెట్టి శ్రీనివాసరావు రైతులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం నల్లజర్ల, మారెళ్లమూడి, సింగరాజుపాలెంల్లో ర్యాలీలు, గ్రామసభలు నిర్వహించారు. సింగరాజుపాలెంలో ప్రకృతి వ్యవసాయం చేసి అధిక దిగుబడులు సాధించిన రైతులు దొండపాటి రాంబాబు, కొఠారు సత్యనారాయణ, వామిశెట్టి భాస్కరరావును సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయం వల్ల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. రసాయన ఎరువులతో పండించిన పంటల వల్ల అనారోగ్యాలు తప్పవన్నారు. సొంత పొలాల్లో కొంత మేరకైనా ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. దీనికి సంబంధించిన కషాయాలు రైతులకు అందుబాటులో ఉంచుతున్నట్టు చెప్పారు. ఖరీఫ్ సాగుకు 45 రోజుల ముందు నవధాన్యాల సాగు చేయాలని రైతులకు సూచించారు.

అవగాహన ర్యాలీ

దేవరపల్లి: నవ ధాన్యాలను సాగు చేసి భూసారాన్ని పెంచాలని ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది దేవరపల్లిలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. 2025 ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ర్యాలీ నిర్వహించి, రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ శాఖ, ప్రేరణాత్మక ప్రచారం సాధికారిక సంస్థ సంయుక్తంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ రీసోర్స్‌పర్సన్లు పద్మావతి, శ్రీనివాస్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



నల్లజర్లలో ర్యాలీ చేస్తున్న సిబ్బంది



దేవరపల్లిలో సిబ్బంది అవగాహన ర్యాలీ

క్వారీల్లో అక్రమ తవ్వకాలపై విచారణ చేస్తున్నాం

- తహసీల్దార్ దుర్గా ప్రసాద్ వెల్లడి
- క్షేత్ర స్థాయిలో మైనింగ్, సర్వే అధికారులతో కలిసి దర్యాప్తు చేస్తాం
- నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటాం

కొవ్వూరు: క్వారీల్లో అక్రమ తవ్వకాలపై విచారణ చేపట్టామని తహసీల్దార్ ఎం.దుర్గా ప్రసాద్ ప్రకటించారు 'క్వారీల్లో అక్రమ తవ్వకాలు' శీర్షికన సాక్షిలో బుధవారం ప్రచురితమైన కథనానికి అధికార యంత్రాంగం స్పందించింది. అక్రమ తవ్వకాలపై క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టేందుకు అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ మైన్స్, ఇన్‌స్పెక్టర్లతో సంయుక్తంగా క్షేత్ర స్థాయి పరిశీలనా, విచారణ చేయాల్సి ఉందన్నారు. ఈ మేరకు బుధవారం విచారణకు, క్షేత్ర స్థాయి పరిశీలనకు రావాలని భూగర్భ, గనులు శాఖ అధికారులకు లేఖ రాసినట్టు తహసీల్దార్ ప్రకటించారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ,గ్రామ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, గ్రామ సర్వేయర్లు, మైనింగ్ అధికారులు ఈ విచారణకు సహకరించాలని కోరామన్నారు. ప్రస్తుతం విచారణ చేస్తున్నామని, దర్యాప్తు పూర్తయిన తర్వాత పూర్తి నివేదికను సమర్పిస్తామని తహసీల్దార్ దుర్గాప్రసాద్ తెలిపారు. అక్రమ మైనింగ్ చేస్తున్న ప్రదేశాలను గుర్తింపుపై దృష్టి సారించినట్టు ఆయన ప్రకటించారు. ఇప్పటికే దేచెర్ల ఎర్రమట్టి అక్రమ తవ్వకాలపై సాక్షి దినపత్రిక, ఇతర పత్రికల్లోను వచ్చిన కథనాలపై విచారణ చేసి చర్యలు తీసుకున్నట్టు ప్రకటించారు. క్షేత్ర స్థాయిలో మైనింగ్ అధికారులు, సర్వే టీంతో కలిసి మట్టి తవ్వకాలు చేపట్టే ప్రదేశాలను పరిశీలించి, కొలతలు తీసుకుని అక్రమ మైనింగ్‌కి పాల్పడిన భూములపై తగు చర్యలు తీసుకున్నట్టు ప్రకటించారు.



ఎం.దుర్గాప్రసాద్, తహసీల్దార్, కొవ్వూరు

హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు అభినందనీయం



సభలో మాట్లాడుతున్న ఆశీర్వాదం

గోపాలపురం: కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవడంలో దొండపూడి హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని గోపాలపురం గౌతమి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కేఎస్డీ ఆశీర్వాదం అన్నారు. దొండపూడిలో బుధవారం హెల్పింగ్ హ్యాండ్స్ 7వ వార్షికోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశీర్వాదం మాట్లాడుతూ ఎంతో మంది నిరుపేదలకు మేమున్నామంటూ ఆపన్నహస్తం అందించిన ఘనత హెల్పింగ్ హ్యాండ్స్‌కే దక్కుతుందన్నారు. అనంతరం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 30 మంది యువకులు రక్తదానం చేశారు. సుమారు 200 మంది రోగులకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆకీరా, శ్రీకర, ఆరా చర్మవ్యాధులు వైద్యులు, హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమంపై సర్కారు నిర్లక్ష్యం

కొవ్వూరు: నిర్మాణ కార్మికుల సంక్షేమానికి సంబంధించి రూ.4,298 కోట్లు నిధులుండి కూడా వారికి అవసరమైన సంక్షేమ పథకాలు ఎందుకు అమలు చేయడం లేదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుందరబాబు పేర్కొన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలను పునరుద్ధరణ చేయాలని కోరుతూ ఏప్రిల్ 24వ తేదీన కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని ఆయన కోరారు. జిల్లా సీఐటీయూ కమిటీ ఆధ్వర్యంలో స్టాండ్ సెంటర్‌లో ఉన్న చైతన్య తాపీ వర్కర్స్ యూనియన్ కార్యాలయం వద్ద ధర్నా కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఎన్నికల్లో భవన నిర్మాణ కార్మికులకు అండగా ఉంటామని ప్రకటించి, ఎన్నికల్లో కూటమి విజయానికి మీ పోరాటాలే కారణమని, అధికారంలోకి వస్తే కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్నా ఇంత వరకు సంక్షేమ బోర్డుని పునరుద్ధరించలేదని, ఇచ్చిన హామీని అమలు చేయలేదని ఆరోపించారు. సమస్యల పరిష్కారంపై కార్మిక సంక్షేమ మంత్రిని ఇప్పటికే మూడు సార్లు కలిశామన్నారు. 24న నిర్వహించే ధర్నా కార్యక్రమానికి కార్మికులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. భవన నిర్మాణ కార్మిక సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దుకూరి దొరయ్య, సీఐటీయూ అధ్యక్షుడు వల్లేపల్లి నరసింహ మూర్తి, జిల్లా కమిటీ సభ్యులు మానికిరెడ్డి హరిబాబు, జొన్నల రాంబాబు, రేఖా నాగేశ్వరరావు పాల్గొన్నారు.



కొవ్వూరులో భవన నిర్మాణ కార్మికుల ధర్నా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘం నాయకులు

నేచురల్ మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

తాళ్లపూడి: గజ్జరం గ్రామంలో మరిచర్ల శ్రీనివాస్ అనే యువకుడు ప్రజలకు నాణ్యమైన, స్వచ్ఛమైన తాగు నీటిని అందించాలన్న లక్ష్యంతో రూ.5 లక్షలతో తన తండ్రి మరిచర్ల వెంకటేశ్వరరావు జ్ఞాపకర్థం నేచురల్ మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మించారు. ఆ ప్లాంట్‌ను బుధవారం సర్పంచ్ గండి రాంబాబు చేతుల మీదుగా ప్రారంభించారు. మండల పరిసర ప్రాంతాలలో ఎక్కడా లేనివిధంగా ప్రజారోగ్య ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకుని పురాతన కాల పద్ధతిలో ఈ వాటర్ ట్యాంక్‌ను నిర్మించారు. ఈ సందర్భంగా తన అభ్యర్థన మేరకు ట్యాంక్ నిర్మించడంపై గ్రామ సర్పంచ్ రాంబాబు ఎంఎస్‌ను అభినందించారు. ఈ మినరల్ వాటర్ ట్యాంక్ ప్రత్యేక తరహాలో ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో నిర్మించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాత మరిచర్ల శ్రీనివాస్, ఆయన కుటుంబ సభ్యులు, నాయకులు, గ్రామ పెద్దలు స్నేహితులు పాల్గొన్నారు.



గజ్జరంలో వాటర్ ప్లాంట్ ప్రారంభంలో పాల్గొని నీరు పట్టుకుని తెచ్చుకుంటున్న మహిళలు

వీరేశలింగం జయంతి

నిడదవోలు: స్థానిక డొక్కా సీతమ్మ మున్సిపల్ హైస్కూల్లో బుధవారం సంఘ సంస్కర్త, మహిళా హక్కులకోసం పోరాడిన యోధుడు కందుకూరి వీరేశలింగం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ బాల్య వివాహాలను వ్యతిరేకించి వితంతువు వివాహాలను ప్రోత్సాహించిన సామాజిక విప్లవకారుడు కందుకూరి వీరేశలింగమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకుడు జువ్వల రాంబాబు, ఎన్.భీమరావు, పీఈటీ వీరలక్ష్మి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూముల రీసర్వేకు రైతులు సహకరించాలి

గోపాలపురం: ప్రభుత్వం చేపట్టిన భూముల రీసర్వేకు రైతులు సహకరించాలని కొవ్వూరు రెవెన్యూ డివిజనల్ అధికారి రాణి సుస్మిత అన్నారు. గోపాలపురం మండలం సంజీవపురం పంచాయతీ పరిధిలోని నందిగూడెంలో బుధవారం ఫేజ్ 2 రీ సర్వే పనులు చేపట్టారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్డీఓ రాణి సుస్మిత మాట్లాడుతూ నందిగూడెం గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడం జరిగిందన్నారు. గ్రామంలోని 4300 ఎకరాలకు సర్వే నిర్వహించి రైతుల సమస్యలకు పరిష్కారం చూపుతామన్నారు. దాని కోసం ఆరు సర్వే బృందాలు, 15 బ్లాకులుగా ఏర్పాటు చేసినట్టు ఆమె తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.అజయ్‌బాబు, సర్పంచ్ ఇళ్ల శ్రీరామమూర్తి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



నందిగూడెంలో ర్యాలీ చేస్తున్న ఆర్డీఓ తదితరులు

ఏఎంసీ ఛైర్మన్‌గా నాదెండ్ల శ్రీరామ్ నియామకం

కమిటీలో మాజీ మంత్రి కేఎస్ జవహర్ వర్గానికి మొండిచెయ్యి

కొవ్వూరు: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా చాగల్లు గ్రామానికి చెందిన నాదెండ్ల శ్రీరామ్ చౌదరి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం నుంచి బుధవారం ఉత్తర్వులందాయని ఆయన తెలిపారు. గత మండల పరిషత్ ఎన్నికల్లో ఈయన కీలక పాత్ర పోషించారు. చాగల్లు మండలంలో పార్టీ రంగా క్రియాశీలకంగా పనిచేశారు. ఆర్థిక బలం దండిగా ఉండడంతో టీడీపీ తెలుగు యువత విభాగంలో చురుగ్గా పని చేస్తున్నారు. అత్యంత చిన్న వయస్సులో ఏఎంసీ ఛైర్మన్ పదవిని దక్కించుకున్నారు. తాళ్లపూడి మండలం నుంచి జెడ్పీ టీసీ సభ్యురాలిగా పోటీ చేసి ఓటమి పాలైన రావూరుపాడుకి చెందిన రేఖపల్లి మంగామణిని వైస్ ఛైర్మన్‌గా ఎంపిక చేసినట్టు చెబుతున్నారు. ఏఎంసీ ఛైర్మన్‌తో పాటు వైస్ ఛైర్మన్ పదవులు రెండు టీడీపీ తీసుకోవడంతో జనసేన పార్టీ నాయకులు డైరెక్టర్ పదవుల కోసం గట్టిగానే పట్టుబట్టారు. దీంతో చాలా రోజులు జాబితాను పెండింగ్‌లో ఉంచారు. చివరికి రాష్ట్ర వ్యాప్తంగా ఇస్తున్న నిష్పత్తి ప్రకారం జనసేనకి ఇరవై శాతం, బీజేపీకి పది శాతం చొప్పున టీడీపీకి డబ్బై శాతం చొప్పున పదవులు పంచుకున్నట్లు చెబుతున్నారు. ఏఎంసీకి ఆదాయం దండుగా ఉన్నప్పటికీ సొంత కార్యాలయ భవనాల్లేవు. కాపవరం జంక్షన్‌లో ఆరెకరాల స్థలం ఉన్నప్పటికీ భవనాల నిర్మాణం మాత్రం కార్యరూపు దాల్చుకోవడం లేదు. ఈ సారి రానున్న కొత్తపాలక వర్గమైనా ఆ దిశగా ప్రయత్నిస్తుందో లేదో వేచిచూడాల్సిందే.



కొవ్వూరు ఏఎంసీ ఛైర్మన్‌గా నియమితులైన నాదెండ్ల శ్రీరామ్ చౌదరి



ఏఎంసీవైస్ ఛైర్మన్‌గా నియమితులైన రేఖాపల్లి మంగామణి

అప్రమత్తంగా ఉంటే ప్రమాదాలు దూరం

నిడదవోలు : సరైన జాగ్రత్తలు పాటిస్తే అగ్ని ప్రమాదాల నివారించవచ్చునని జిల్లా అసిస్టెంట్ అగ్నిమాపక అధికారి కె.శ్రీనివాసరావు అన్నారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు వాటిని వెంటనే నియంత్రించే జాగ్రత్తలపై బుధవారం పట్టణంలోని గాంధీనగర్‌లో ధరణి అపార్ట్‌మెంట్ వద్ద మహిళలకు అగ్నిమాపక సిబ్బంది ప్రయోగాత్మకంగా వివరించారు. అగ్ని నిరోధకాల ద్వారా వాటిని ఏ విధంగా నియంత్రించాలనేది కరపత్రాల ద్వారా వివరించారు. అగ్నిప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

కొవ్వూరు: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మూడోరోజు గౌతమీనగర్‌లో సూర్య టవర్స్ అపార్ట్‌మెంటు వద్ద అగ్ని ప్రమాదాలు సంభవించకుండా తీసుకోవాల్సి జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.గ్యాస్ సిలిండర్ల లీకేజీ మంటలు వ్యాపిస్తున్న సమయంలో మంటలను ఏవిధంగా ఆర్పాలో ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. ఎలక్ట్రికల్ ఫైర్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అగ్ని ప్రమాదం బారిన పడిన వారిని రక్షించడం, ప్రథమ చికిత్స విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి తెలియజేశారు. అగ్ని మాపక అధికారి ఏపీఎస్ఎస్ఎస్ వేణు,ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



మాక్‌డ్రిల్ ద్వారా గ్యాస్ మంటలను ఆర్పే విధానాన్ని వివరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది